


# డాక్టర్ ప్లేబోయ్

''అలా చెప్పుకుంటూ పిలుస్తున్నారేం ఆయన్ని? డాక్టరంటే పి.హెచ్.డి. తెచ్చుకున్నవాడా?'' అన్నది భవాని కుర్చీలో కూచుని.

''వైద్యం చదివిన వాడే. అప్పుడే ఆయన పేరు నీ చెవినబడింది?''

''అది వాళ్ల వాళ్లే పెట్టారంటావా?'' నోటిమీద వేళ్లుంచి నవ్వుతూ అడిగింది భవాని.

''నిక్‌నేమ్ అయివుండచ్చు. ప్రాక్టీస్ పెరిగి, అభిమానులెక్కువై అలా చెప్తుంటే అదే స్థిరపడిందేమో. అసలుపేరు నేనూ విన లేదు''.

''ప్లే బోయ్ గారున్నారా? అనడిగితే గేలిచేస్తున్నట్లు అర్థం రాదూ?''

''అటువంటి నిక్‌నేమ్ వూరికే రాదే అని అడిగాను. నేను డాక్టర్ని కన్సల్ట్ చేయాలి. దాపుల లేడీ డాక్టర్లందలేదు. ఈయన పేరే చెప్పారు. ఫిజిషనా? సర్జనా?''

''ఫిజిషనే. నేనూ నీలాగే ఆలోచించాను. డాబూ దర్పం లేదు. నవ్వుతూ ఫ్రెండ్లీగా వుంటాడు. కాని టూమచ్ హ్యూమర్. అట్రాక్టివ్. చక్కగా డ్రెస్ చేసుకుంటాడు. సీరియస్ కేసైనా నవ్వుతూ నవ్విస్తూనే నయం చేస్తాడట. మేల్ అండ్ ఫిమేల్ పేషంట్సు తేడాలేదు. ఫీజు విషయంలో కటూబిటీగా లాగడు. గోడకి బల్లా దాని మీద ఫీజెంతో వ్రాసి లేదు. నర్స్‌గానీ, కాంపౌండరుగానీ చెప్పరు. వాళ్లూ నవ్వుతూనే సాయపడతారాయనకి. నర్సరీ గార్డెన్, చిన్న సైజు మెడికల్ హాల్, అన్నీ నీట్‌గా వుంటాయి''.

''చాలా పరిశీలించావే. కన్సల్టేషన్‌కి వెళ్లావా?''

''నేనూ పేరు వినే వెళ్లాను. ఆయన్ను చూడటానికే వస్తారేమోననుకున్నా. బాగా ఎంటర్‌టెయిన్ చేస్తాడు. కంప్లెయింట్‌తో బాటు కబుర్లూ వింటాడు. పర్సనల్ విషయాలూ వింటాడు. యే టాపిక్ యెత్తినా అయిష్టత చూపడు. గోడలకున్న పటాలు, బొమ్మలే చెబుతాయి ఆయన పేరు. పిన్నప్స్, మోడెల్స్, కొత్త డిజైన్ దుస్తులతో టీనేజర్సు బొమ్మలు. పొద్దున్నే వెళ్తే టివి మీద ''ఫిట్'' అనే ప్రోగ్రామ్ కంటబడుతుంది. గోడకున్న ప్లాస్టిక్ షెల్ఫులో కథల పుస్తకాలూ, నావెల్సూ, జర్నల్స్, ఫొటోగ్రఫీకి సంబంధించిన పుస్తకాలూ, రెవ్యూ, ఫెమినా, యీవ్స్ వీక్లీ, మెడికల్ జర్నల్, ప్రైవేట్ ప్రాక్టీషనర్ అనేవి కనిపిస్తాయి. తీసి చదవచ్చు డాక్టరుండేదాకా. పక్కగా బల్లమీద అద్దం, దాని కింద ఫొటోలు నూతనతారలవి. టివి గైడ్ వుంటాయి. నేను ఖుష్‌రామ్ అంటే బావుంటుందేమోనని అనుకుంటాను''.

వివరాలు చెప్పేప్పుడు శ్యామల మొహం ఆనందంగా కనబడటం గమనించింది భవాని. ''స్వెట్టరెవరికీ ? మగవాడి స్వెట్టరల్లే వున్నదే''.

'ప్లేబోయ్ డాక్టరుకే. నా ఒంటిమీద దద్దుర్లు లేచేవి. రాత్రిళ్లు దురదలు విసుగెత్తేంచేవి. కన్సల్ట్ చేశా. క్యూర్ చేశాడు. ఫీజు చెప్ప లేదు. బిల్ యివ్వలేదు. స్వయంగా అల్లి యివ్వాలనిపించి అల్లాను. ఇది ఇంగ్లీష్‌వూల్, గిల్డ్‌లో వున్నప్పుడు చాలా అల్లి యిచ్చాను సైనికుల కోసమని, బావుందా? అయిపోయింది.'' వూలూ సూదులు బల్లమీదుంచి, స్వెట్టర్ పైకెత్తి పట్టుకుని చూపింది శ్యామల. '' మెడ పైకి పోనిచ్చి తిప్పి కిందికి తేవచ్చు. చూడు.'' అని చూపింది.

''కొలతలెట్లా తెలుసు? తీసుకున్నావా?'' అని నవ్వింది భవాని.

''చెప్పాగా చాలా అల్లానని. మనిషిని చూసి కొలతలు వూహించవచ్చు. పుస్తకాలున్నాయి. వయస్సు, కొలతలు డిజైన్లు, బొమ్మలూ, యేరంగులు వాడాలి, సూదుల నెంబర్లు అన్నీ వుంటాయి. ఫాలో అయితే చాలు. పుస్తకాలు చూస్తావా?'' అని లేచింది శ్యామల. స్వెట్టరు బల్ల మీదుంచింది.

''మరోసారి వచ్చినపుడు చూస్తాలే. స్వెట్టరెప్పుడు ప్రెజెంట్ చేస్తావు? నీతో నేనూ వస్తాను. సరిగా వినపడటం లేదని గ్రహించి, ఆటలు పట్టిస్తాడేమో. వెకిలితనం భరించలేను'' అని లేచింది భవాని.

''యేమో. ఫోన్ చేస్తా. వత్తువు గానివి. ఇద్దరం పోదాం''.

''స్పెషలిస్టా?''

''హ్యూమరస్ వేలో మాట్లాడటంలో స్పెషలైజ్ చేశాడని నా అభిప్రాయం''

''మరి నీ కంప్లెయింట్ విని హాస్యాలాడ లేదూ?''

''స్వభావమే అంతేనేమో అనుకున్నాను. నయమైందని సంతోషించాను''

''యెందుకలా వచ్చాయి అనడగలేదు నువ్వూ?''

'' ఉక్రోషం, ఆవేశం, కోపం కంట్రోల్ చేసుకొనుట, మొగుడిని హర్ట్ చేయలేక లోపలే ఉడికిపోతే అలా వస్తాయిట. వీడికి రెండు చేతులా సంపాయించటం రాదే అని బాధట నాకు. నేనే సంపాయించుకోవాలని మార్గాలు వెతుకుతున్నానట'' అని శ్యామల నవ్వింది.

''మొగుడు లేడని చెప్పలేదూ?'' భవానీ దీర్ఘం తీసింది.

''చెప్తే యెవడూ నన్ను నోటీస్ చేయటం లేదని, పాదాక్రాంతులు కావడం లేదనీ అంబలాగా మగని కోసం తపిస్తున్నానట. తాపం పెరిగి గోకితే రక్తం పుబుకుతున్నదట. అంతలోనే నవ్వుతూ కులుకుతూ రెండో గదిలోకి వెళ్తూ మెల్లిగా ''అలాంటి యిలాంటి వాడిని కాను శ్యామలా! అర్ధరాత్రి రాను రాను అమాయకుడను శ్యామలా'' అని పాడుతూ వెళ్లి కర్టెన్ లాగేశాడు.

ఇద్దరూ నవ్వేశారు. ''భలే డాక్టర్. ఫోన్ చేయి వస్తాను.''

2

భవానీ, శ్యామలా సర్జరీలో అడుగుంచారు. నిలబడ్డారు. అన్ని కుర్చీలు పేషెంట్స్ ఆక్రమించారు. నేలమీద అందమైన వెలగల తివాసీ. మంచి డిజైన్ రంగురంగుల పూలూ లతలూ వున్నాయి. స్టాండు మీద ఫోను. మరో వేపు స్టాండు మీద టి.వి. గోడలకి అలంకారంగా ప్లాస్టిక్ వాజులు, వాటిలో ప్లాస్టిక్ పూలు మరో చోట బల్ల దాని మీద అందమైన భరిణ. దానిలో పరిమళం వదిలే అగరు ముక్క. కర్టెన్ తొలగించిన వైద్యుడు వీరిని చూశాడు. వచ్చి నవ్వుతూ పలకరించాడు. విడివిడిగా కూచుని వున్న స్త్రీ పేషంటుని, పురుష పేషంటునీ లెమ్మన్నాడు. ''మీరిద్దరూ యీ సోఫాలో యీమె పక్కన కూచోండి, ఖాళీ వున్నది. ఫియాన్సీయేగా లిల్లీ! యెవరూ యేమనుకోరు. పేరంట్సు పర్మిషన్ శాంక్షన్ చేయగానే ఆల్టర్ దగ్గరికి పరుగెత్తుదురు గాని. మీ పక్కామె ఓల్డ్ వుమన్ అయినా ఆధునిక భావాలే. రండి ఖాళీ అయిన కుర్చీలాక్రమించండి మీరిద్దరూ. మరో రెండు ఖాళీగాబోతున్నాయి. వీరిద్దరికీ మరో యెంగేజ్‌మెంటున్నదిట. ప్రిస్క్రిప్షన్ వడపీక్కుని వెళ్లిపోవాలని ముళ్లమీద కూచున్నట్లు కూచున్నారు. చూశారా?'' తెచ్చిన ప్రిస్క్రిప్షన్ అందివ్వగానే వాళ్లిద్దరూ లేచారు.

గోడకు వేలాడుతున్న ప్లాస్టిక్ షెల్ఫు నుంచి ఒక వీక్లీ తెచ్చుకుని బొమ్మలు చూస్తున్నది భవాని. మాటలు వినబడుతూనే వున్నాయి. నర్స్ వచ్చి అప్పాయింట్‌మెంట్ పెట్టుకుని టైమ్‌కి వచ్చిన వారిని, ముందు వచ్చిన వారిని చూసి వెళ్లిపోయింది. వారి వంక చూస్తున్నాడు డాక్టర్.

''మంచి సంబంధం సెటిల్ చేయాలని చూస్తున్నామండి. పెళ్లి చూపులకి వస్తామంటే సరేనన్నాము. వచ్చారు. చూచారు''.

''పిల్ల నచ్చింది. తక్కినవి చెప్పండి'' అన్నారు పెళ్లివారు. ''పిల్ల పేర లక్ష ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేస్తాము'' అంటుండగానే వుడ్‌బి వియ్యంకుడు, ''మా చేతులోనే పోయాలి లక్ష. పిల్లపేరెందుకూ?'' అన్నాడండి. '' వీరే వియ్యంకులు. బిపి వుందేమోనని తెచ్చాము'' అన్నాడు పెద్దమనిషి.

''అదా కుదర్చాల్సినది.'' ''మీ అబ్బాయి ప్రమాదవశాత్తూ పోతే మా అమ్మాయి గతేమిటీ? అందుకని అమ్మాయి పేరే వేయటం మంచిది'' అని నచ్చచెప్పాలి. నా పెళ్లిచూపుల్లో అలాగే గడిచినై డైలాగులు. తేలిపోయింది.'' నవ్వుతూనే అన్నాడు డాక్టరు.

'పెళ్లి జరిగిందా?!'' పిల్ల తండ్రి నోరు తెరిచాడు.

''యెందుకు జరుగుతుందీ? పిల్లకదంతా బార్బరస్‌గా తోచి లేచిపోయింది'' కదిలిపోతూ అభినయిస్తూ నవ్వాడు.

''వాట్ డూ యూ మీన్ డాక్టర్! పెద్దల మధ్య నించే లేచిపోయిందా? యెవడితోనన్నాన?'' తానూ జోకులు విసరగలను విట్టు వేయగలనని వియ్యంకుని అభిప్రాయం.

''రెండూనూ. మాచ్ కుదిరేట్టు లేదే. ఫిక్స్ అయేనాటికి యేజ్ బార్ అయేట్టున్నదని విసుగేసిందట. మరసటేడు ఎయిర్‌పోర్టులో యిద్దరం తారసిల్లితే చెప్పింది. కంప్యూటర్ సైన్సెన్ పూర్తిచేసి, స్టేట్స్‌కి వెళ్తున్న అబ్బాయి ప్రపోజ్ చేశాడట. అందులో యికానమీ అర్థమై వెంటనే ఒప్పుకున్నదట.''

''పెళ్లి చేసుకుందా లేదా?'' దీర్ఘం తీశాడు తండ్రి.

''రిజిస్ట్రేషన్ జరిగింది. వీసాలు సంపాయించారిద్దరూ.''

''ఫీజెంత?'' లేచి వియ్యంకునీ లేవదీశాడు తండ్రి.

ఫీజెంతో చెప్పే బల్లకోసం గోడలు చూస్తున్న వియ్యంకుడు ''ప్రిస్క్రిప్షన్ యివ్వలేదుగా'' అన్నాడు.

''నాకేమో యిచ్చినట్టే అర్థమైంది. ఇద్దరం పూల్సుమని నవ్వుతూ కథ అల్లాడు ప్లేబోయ్. మనమే తేల్చుకుందాం. ఫిఫ్టీ ఫిఫ్టీ'' అంటూనే వంద నోటు జేబులోంచి తీసి డాక్టరు కిచ్చి ''థాంక్స్ డాక్టర్. మా రోగం కుదిరి పోయింది. పెళ్లికి పిలవటానికి వస్తాము. ష్యూర్‌థింగ్.'' ఇద్దరూ వెళ్లిపోయారు.

ఒక నడివయస్కుడు తన భార్యను చూపుతూ చెప్పాడు. '' మా అమ్మ నోరు విప్పగానే, నా భార్య మొదలు నరికిన అరిటి చెట్టులాగా పడిపోతుంది డాక్టర్! డాక్టరమ్మను కన్సల్టు చేశాము. ఫిట్సు తగ్గించే నేసల్ డ్రాప్స నిద్ర మాత్రలో చిన్న ముక్క వాడమని ప్రిస్క్రైబ్ చేసింది. బికాంప్లెక్సు యింజెక్షన్సు యిప్పించమన్నది. కాని గుణం కనబడలేదు.'' కన్నార్పకుండా చూశాడు భర్త.

ఇద్దర్నీ చూశాడు డాక్టర్ ''అది జబ్బుగాదు. మీరు తగినంత ప్రేమ

చూపటంలేదని సైఫర్ బాషలో అంటున్నదావిు. మీరు డిసైఫర్ చేయలేకపోయారు'' అన్నాడు నవ్వుతూ.

''సరే నమ్ముతా. ప్రిస్క్రిప్షన్ చెప్పరా?'' అన్నాడు నవ్వకుండానే.

''గట్టిగా వాటేసుకుని, నేను నీ పక్షం. ఆవిడ నిన్నేం చేయలేదు'' అనాలి. తల్లిగారు చూస్తుండగానే భార్యను రెండుచేతులా యెత్తుకుని ముద్దులు పెడుతూ బెడ్‌రూమ్‌లోకి దారితీసి తలుపు గడియపెట్టాలి. దాంతో తల్లిగారు ఆరోగ్యం పొందుతారు. మరోమారు నోరు విప్పితే యీ సీను చూడాల్సివస్తుందని నోరు కంట్రోల్ చేసుకుంటారు''.

భార్యా నవ్వుకున్నది. భర్తేమో, ''మరి నేను యింట్లో లేకపోతేనో?'' అన్నాడమాయకంగా.

''డాక్టరమ్మ ప్రిస్క్రైబ్ చేసిన నిద్రమాత్ర ముక్క మీ అమ్మగారికి వాడండి. మందకొడిగా చూస్తు కూచుంటారు. పనియెలాగు చేయర్రైపాయె. టూమచ్ స్పేర్ టైమ్ నోటికి పనితగిలించింది''.

''చాలా థాంక్స్ డాక్టర్, ఫీజిదిగో. దీని పరిస్థితి చక్కబడితే యింకా యిస్తా డాక్టర్'' ఫీజందిస్తూ అన్నాడు.

'ప్లేబోయ్ హాస్యాలాడారు. నిజమనుకున్నారా?'' అన్నది భార్య. ఇద్దరూ వెళ్లిపోయారు.

నర్స్ వచ్చి నెక్స్ట్ పేషంటుని లేవదీసి వెళ్లింది. చూస్తున్నాడు. పేషంటు రూపవతి, సొగసరి. మేకప్ మరింత వన్నె తెచ్చింది.

''నేచర్‌కాల్ సైన్ చేయగానే దడవస్తుంది డాక్టర్.''

''పెయిన్ వస్తుందా?'' రోగిని నిదానంగా పరిశీలిస్తున్నాడు. తమాషాగా నవ్వుతున్నాడు.

ఇక్కడ దురద పెడుతుంది.'' అని క్లీవేజ్ వద్ద గోక్కుంటూ ''అక్కడ గోకుతుండగానే యిక్కడ దురద.'' వీపు మధ్య గోక్కుంటూ వెనక్కు చూసింది. తర్వాత పిక్క మీదా. అలా రెండు నిమిషాలు గడిచాయి. కూచున్నది.

'' ఐసీ. ప్రిస్క్రిప్షన్ రాసివ్వనా?''

''దాని కోసమే వచ్చాను. నీ కోసమనుకుంటున్నావా? పేరుకు తగ్గట్టే వున్నది కారెక్టర్'' చిరచిరలాడింది పేషంటు.

''నా కారెక్టరెట్లాంటిదీ? అది మీ కెట్లా తెలుసూ? యెవరు చెప్పారూ? చెప్పినా మీరెలా నమ్మారూ?'' కుదురుగా కూచుని చేతులు కలిసిపెట్టుకుని దీర్ఘాలు తీస్తూ అడిగాడు ప్లేబోయ్.

''జానీ నా రిలేటివ్వే. కంట్లో యిసక పడినట్లు దురద, అని బాధ చెప్పుకుంటే గది చీకటి చేసి మొహంలో మొహం పెట్టి చిన్న లైటు వేసి చూశారట. కంట్లో రెండు మందుచుక్కలేసి కళ్లు మూసుకూర్చోమన్నాదట నర్సమ్మ. విసుగేసి లేచిపోతుంటే కౌంగట్టుకున్నారట మీరు'' అంటున్నది.

''తోడు తెచ్చుకోవాలని తెలియదూ? తెలియదే అందాము. ఇక్కడ నర్సున్నదే. లేచి నలుదిక్కులా యెగురుతుంటే పమిట గాలిలోకి లేచింది. నర్సు దిద్దిందేమో. ఉన్మాదినేమోనని ఇంజెక్షనిచ్చిందేమో. ఆమె సీరియస్ హిస్టీరియాతో

సతమతమౌతున్నది. యెవరూ లొంగరని. యేదో సీన్ వేసి నేరాలు మోపుతారు హిస్టీరికల్ పేషంట్సు. క్రమంగా ఆ జబ్బు కచ్చ పెంచుతుంది. న్యూసెన్సు కింద తయారౌతారు''.

''అలాగా'' అంటూ గోడల మీది చిత్రాలు చూసింది.

''మరి అలాంటి చిత్రాలున్నాయేం కన్సల్టేషన్ రూమ్‌లో? అవి మీ పేరు చెప్పటం లేదూ?'' అని తర్జనితో చూపింది.

''అవి నేను అతికించినవీగాదు. వేలాడదీసినవీగాదు. అన్ని వయసుల వారూ వస్తారు. ''యెప్పుడూ రోగాలూ, నెప్పులు, కంప్లెయింట్స్ ప్రిస్క్రిప్షనివ్వటం అంతేనా డాక్టర్! ఇవీ చూడాలి, అని వేలాడదీశారు. బాపూ ఆశ్రమానికెళ్లిన వారు విదేశీ వస్తువులు చూసి, ''బాపూ! విదేశీ వస్తువులు కొనకండి'' అని భోదిస్తూ, మీ ఆశ్రమంలో చాలా వాడుతున్నారే?'' అని దెప్పుతున్నట్టు అంటే, ''అవన్నీ ప్రెజంట్స్ పగలగొట్టనా, పారవేయనా, యిస్తుంటే తిరస్కరించనా?'' అన్నారుట బాపూ''.

''యెన్నడూ రామరామా అనన్న అనరుట జ్యోతి చెప్పింది. అశ్లీల పదాలు వేస్తూ లేకిగా మాట్లాడుతారట.'' అంటున్నది.

''పోనీ యిపుడు మీకు దేవుని కథ చెప్పనా?''

''చెప్పండి. చెప్పగలరేమో చూద్దాం. మీ కసలు మతమనేదే లేదట నా కజిన్ చెప్పింది స్వర్ణ లెక్చరర్''.

'' ఓ ఆమె! ఆమెకు మతమున్నదటనా? యేమ్మతం? మతం యేమని

బోధిస్తున్నదిటా? యెవరి నెత్తినన్నా చెయ్యిపెట్టమన్నదిటనా? సయానా చెల్లెలికి ద్రోహం తలపెట్టమన్నదిటనా? యెక్కడికి పోయినా తంపీలు పెట్టిరా అన్నిదిటనా? యేదో ఒకటి సంగ్రహించుకురా అన్నదటనా? అటువంటి బోధలు క్లెప్టోమానియా అనే మతం చెప్తుంది. రావటం మానేసి, నింద వేసి, ప్రాపగండా చేస్తూ, నా ప్రాక్టీసు పడగొట్టమని బోధిస్తున్నదట ఆ మతం ప్రస్తుతం''.

''కథ చెప్తానన్నారు'' గోక్కుంటూ గుర్తు చేసింది. మాటమార్చాలని చూస్తున్నదని ప్లేబోయ్‌కి అర్ధమైంది.

''శ్రీ మహావిష్ణువని వున్నాడు. కమల అనే అమ్మాయిని సముద్రుడనే పెద్ద భాగ్యశాలికి యిచ్చి పెళ్లిచేశాడు. కాని యెన్నాళ్లకీ సంతు లేదు. గారంగా పెరిగింది గదూ, యిగోతోడై చంచలి అయి తిరగసాగింది. నొచ్చుకోక, తనకు చేతానని చూపటానికి శ్రీ మహావిష్ణువే ఒక కొడుకుని గని వాడికి బ్రహ్మ అనే పేరు పెట్టి బాగా చదివించాడు. వాడు పోయి సరస్వతి అనే విదుషీమణిని పెళ్లాడాడు. వారికీ సంతు లేదు. బ్రహ్మే సంకల్పమాత్రంగా కొడుకును గని పెంచుతుంటే సరస్వతి వానికి సంగీతం నేర్పింది. బ్రహ్మెమో సైకాలజీ నేర్పి నారదుడని పిలిచాడు. నారదుడనగా నరులను చుట్టి వచ్చేవాడు. వాడు రాకెట్‌లాగా వెళ్లి మూడు లోకాలు చుట్టి వచ్చి వార్తలు అందిస్తూ కబుర్ల రాయుడైనాడుటగాని నచ్చిన పిల్ల అందక పెళ్లే ఆడలేదుట. యెడాప్టూచేసుకోలేదుట. బాచిలర్‌గానే ప్రసిద్ధికెక్కాడుట''.

భవానీ, శ్యామలా వింటూ నవ్వుతుంటే పేషంటు వూగిపోతూ నవ్వింది.

''మరి ప్రిస్క్రిప్షన్ గొలకరూ?'' నవ్వింది.

''మీ తోకపట్టుకు తిరిగే బోయ్ ఫ్రెండ్ అవసరమున్నది మీకు. మిమ్మల్ని నోటీస్ చేసేవారు లేరనీ, కేర్ చేసేవారులేరనీ మనస్సు పెరపెరలాడుతూ వికలమౌతున్నది. బోయ్ ఫ్రెండే మందు.''

''ఫీజు పేర్కొనరూ? నాకు తెలియదు. బల్ల లేదు''.

''పదహారేళ్లమ్మాయి హాస్టల్ భోజనం పడక, కడుపులో మంట బయలుదేరి , శలవులకు వచ్చినపుడు, వాళ్లన్నను వెంటబెట్టు కొచ్చింది. కన్సల్టేషన్‌గాక క్యూర్ చేయాలన్నది. ఒంటరిగా రాసాగింది. మొత్తానికి మంట తగ్గించా. ఫీజుకిందేమో ఒళ్లో కూచుని ముద్దులుబెట్టింది. ఇంటికి పోయి, '' ఆ ప్లేబోయ్ పెళ్లాడుతాడట. పెళ్లి చేసేయండి.'' అని నమ్మ బలకింది. వాళ్లెట్లా నమ్మారో. అదీ కాకపోతే కూతురు మనస్తత్వం తెలుసేమో. కొంతమందికి జన్మతః వుంటుందా జబ్బు. ధృతరాష్ట్ర పుట్టు గుడ్డి లాగా. వయస్సొచ్చేకొద్దీ అబద్ధాలాడటం, నిందలు వేయటం, మనుషుల్ని కేసుల్లోకి నెట్టటం చేస్తారు''.

''చివరికేమైంది.''

''వాళ్ల వాళ్లు రానే వచ్చారు. ''రేప్ చేశావుట. పెళ్లి చేస్తా గుళ్లో పెళ్లిలాటిది. రా.'' అన్నారు. పాకం ముదిరిందే, అని లై డిటెక్టర్ తెప్పించా. నా పేషంట్సు యస్సైనీ, హెడ్డునీ పిలిపించా. ఆ మెషీను ద్వారా వారి యెదుట జబ్బు ప్రూవ్ చేశాను. మనుషుల్ని బురదలో కీడ్చే స్వభావమని నిరుపించాను''. పేషంటుకి వున్మాదించి లేచి నిలబడింది. ''నేనలాటిదాన్నని కథ అల్లారు''. హాండ్‌బాగ్‌లోంచి అయిదు వందనోట్లు తీసి ప్లేబోయ్ మొహాన విసిరి, బాబ్డ్ జుట్టు యెగరేసుకుంటూ హైహీల్సు టకటకలాడిస్తూ వెళ్లిపోయింది.

శ్యామల లేచి స్వెట్టరున్న ప్యాకెట్ డాక్టరు కెదురుగా బల్ల మీదుంచింది. ''మీకే. స్వయంగా అల్లాను. వింటర్ వస్తున్నది. స్వెట్టర్ వాడుకుంటారని ప్రెజెంటిచ్చా.'' అని కూచున్నది. విప్పి చూశాడు. ''రెడీమేడ్‌దేమో. కొన్నారేమో. గొప్పకి మీరే అల్లారంటున్నారేమో. పోనీ ఒప్పుకుందాం. శ్రమ. టైం. కొలతలెలా తెలుసు? రంగులెలా తెలుసు? మెడకాలర్ చాలా బాగున్నది. వాటీజ్‌ది ఐడియా? మెత్తని మనసేనా యది యొత్తియిటుల్ చూడనేల యో శ్యామల.'' అని పద్యంలాగ చదువుతున్నాడు.

శ్యామలా భవానీ నవ్వారు.

''స్వయంగా అల్లిందో, కొన్నదో కనిబెట్టలేరూ డాక్టర్? వింటూనే జబ్బు కనిబెట్టేస్తున్నారుట.'' అన్నది శ్యామల.

డాక్టర్ స్వెట్టర్ యెక్కించుకున్నాడు. మెడ కాలర్ చక్కగా దిద్దుకుని సరీగ్గా కూచుని. ''బావున్నానా?'' అన్నాడు.

''చాలా బావున్నారు. చక్కగా ఫిట్ అయింది. స్టూడెంట్‌లాగ వున్నారు. మెషీన్‌మేడ్ స్వెట్టర్లో తప్పులుండవు. హేండ్‌మేడ్ స్వెట్టర్లో వూలు వదులైన చోటు, వూలు కలిపిన చోటూ కనబడతాయి. జాయిన్ చేసినచోట కొసలు కనిపిస్తాయి. పుస్తకాలున్నాయి డాక్టర్ ఫాలో కావటమే. కొలతలు, సూదులు, యెంత వూలుకావాలీ రంగులు అన్నీ వుంటాయి. బొమ్మ వుంటుంది. క్రాస్ స్టిచ్ చెప్పే పుస్తకాలున్నాయి చూడలేదూ. డిజైన్లూ రంగులూ అన్నీ చెపుతాయి బొమ్మలు.''

''డబ్బే నా మొహాన విసిరేయకపోయారు? చూశారుగా.''

''అదీ చేస్తా వున్నప్పుడు. భవానీ యెనిమిదౌతున్నది. నీ కంప్లెయింట్

చెప్పేయ్.'' అన్నది శ్యామల.

చివరికి మిగిలింది వీరిద్దరే. శ్రద్ధగా వింటున్న ఫోజులో కూచున్నాడు ప్లేబోయ్.

''తల్లో ధ్వనులు. చెవులల్లో యేవో కూతలు. యేదో పాకుతున్నట్టుంటుంది. పిచికారీ చేయించి చూస్తే యేమీ లేదు. గంట కొట్టినట్టు, జీపు ఆగినట్టు, రైలు చప్పుడు విమానం మోత, పిచ్చికలరుస్తున్నట్టు, కీచురాయి అరుపు. నిద్ర బట్టదు.'' అలా చెపుతూ చూస్తే జాలిపడుతున్నట్టున్నది ప్లేబోయ్ చూపు.

''జాలి పడటమెందకూ డాక్టర్!'' అన్నది భవాని.

''జబ్బు అనుకోటమెందుకు? లాభంగా వున్నాదిగా? తల పగిలిపోయే సినిమా సంగీతం వినబడదు. ఇష్టంలేని మాటలు వినబడనట్లు చూడచ్చు''.

''వినికిడి శక్తి తగ్గిపోతున్నదంటారా? అప్పుడే. అడ్వాన్స్డ్ యేజ్ వల్ల అంటారా నన్ను.'' అని నొచ్చుకున్నది భవాని.

'' ఒక పేషంటు, నీళ్ల చెంబు షోల్డర్ వద్ద కదుల్తున్నట్టు వుంటుందని కంప్లెయింట్ చేసింది. యెవరన్నా మరచిపోయినారేమో దాని మీద పేరుండాలే చూడండి యిచ్చేద్దామన్నా.'' '' ఆపరేషన్ చేసి తీసేయలేరా?'' అన్నది. ''నేను సర్జన్ని కాదు, సర్జన్ని కన్సల్ట్ చేయమన్నాను''.

''హాస్యమాడుతున్నారా? అది కుదరని వ్యాధా? యెక్కువౌతుందా? మా అమ్మే, ''దానికి వినబడటంలేదు. అటు తిరిగివుంటే అసలే పలకదు'' అని

అందరితో అంటున్నది.

''అదీ లాభమేగా. అత్త ఆడబడుచూ మొగుడు అనే మాటలు వినక్కర్లేదు. అటు తిరిగి నించోవచ్చు.'' అని నవ్వాడూరడింపుగా.

''నాకు మీరుదహరించినవి లేవు. చెముడు బిగినింగ్‌లో వున్నాదనీ అది నయంగాదనీ సూచిస్తున్నారా డాక్టర్?'' అని బిక్క మొహం పెట్టింది భవాని.

''వివరాలు వింటే, యిప్పుడున్న, హుషారూ చెలాకీ తనం, తేటమొహం పోయి, నిరాశ కనిపిస్తుంది మొహాన. ఇప్పుడే ఆరోగ్యంగా నిశ్చింతగా వున్నారు''.

భవానీ నోరు దెరిచింది. శ్యామల వీపుమీద రాచింది.

నర్సు వుంచి వెళ్లిన సాఫ్ట్ డ్రింక్ అందించాడు ప్లేబోయ్.

సిప్ చేస్తూ అన్నది. ''నిజమే. దారి లేదా? కొంత మంది ఆపరేషను చేయించుకుని వినగలిగారని విన్నాను. అదీ లాభం లేదా డాక్టర్? చెప్పేయండి. గుండె ఊయి చేసుకున్నాను'' అంటున్నది భవాని. కాని పెదివులు వణుకుతున్నాయి.

'పేషెంట్సుని యేడిపించి, నిరాశపరచటం నాకు సుతారామూ నచ్చదు. కేసులూ చాలా విన్నా. చూశాను. అది హెరిడిటరీ అయితే అన్ని థెరపీలు ఫెయిలౌతై. యోగా, హిప్నోటిజం, మెస్మరిజంలో నమ్మకముంటే వాటిని ట్రై చేయచ్చు. వర్రీ కాకూడదు. సన్నని నరాలు స్లోగా దెబ్బతింటూ పాడౌతున్నాయి. బంధువులకెవరికన్నా వుండి వుండాలి. కాని సైన్సూ, వైద్యము బాగా యెడ్వాన్స్ అయూయి గదూ'' అంటున్నాడు.

''కంప్లీట్‌గా స్టోన్‌డెఫ్‌లాగా అవుతానా డాక్టర్'' అన్నది. డ్రింక్ గ్లాసు బల్ల మీదుంచేసింది. '' ఆంధ్రా మిల్టన్ అని పేరే పొందిన కవిగారికి చూపు పూర్తిగా పోయింది'' అన్నది.

''అదే వద్దనేది. ఇప్పటికి బాగానే వినబడుతున్నది గదూ? పూర్తిగా పోదు. కాని ముదరచ్చు. బిథోవెన్‌కి చెముడొచ్చి ముంచేసినా, శ్రోతలను కూచోబెట్టి, పియానో వాయించి వినిపించేవాడట. వాళ్లు చప్పట్లు కొట్టి సంతోషం వెల్లడిస్తే, వాళ్ల మొహాలు చూసి తాను కంపోజ్ చేసిన సింఫొనీ బాగా కుదిరిందని అర్థం చేసుకునే వాడట. బాలగంధర్వాకి ఒక చెవి వినికిడి శక్తిని కోల్పోసాగింది. తలపాగా చుట్టి యెడమ చెవిమీద చేయి వుంచి ధైర్యంగా పాడమని గురువు చెపితే అలాగే చేశాడు. మంచిపేరు వచ్చిందిగా. ఇప్పుడు మనం అంతకన్న మంచి పరిస్థితుల్లో వున్నాం. వినికిడి యంత్రాలు పవర్‌ఫుల్‌వి వస్తున్నాయి. కళ్లు తెప్పిస్తున్నారు. గుండె మార్పిడీ, ఓపెన్ హార్ట్ సర్జరీ, కృత్రిమ అంగాలు. నిరాశా దిగులూ అనవసరం.''

లేచారిద్దరూ.

''కూచోండి'' అన్నాడు.

యేమిటన్నట్టు చూస్తు కూచున్నారు. మరొక రూమ్‌లోకి పోయి కాసేపటికి వచ్చాడు ప్లేబోయ్. చేతులో యేదో వున్నది. యిద్దరూ చూస్తున్నారు.

''వినికిడి యంత్రం గురించి వివరాలు నాకు తెలియవు డాక్టర్. మీరు కూడా వుండాలా. రావాలా? వెల యెంత వుంటుంది? ఐ యామె వర్కింగ్ వుమన్. టెస్టులు చేయించుకోవాలా? బాధాకరమా? నేను జాబ్ మానను.'' అన్నది భవాని.

''దటీజ్ గుడ్ స్పిరిట్. అలా వుండాలి ధైర్యంగా మాట్లాడాలి. మునిగిపోయినట్లు అనుకోరాదు. ఇదుగో యిదీ యంత్రం. నా ఫ్రెండ్ హియరింగ్ ఎయిడ్ సెంటర్ అని నడుపుతున్నాడు. కొనే వారందితే అమ్మి పెట్టమనీ కమీషనుంటుందనీ చెప్పి యిచ్చి వెళ్లాడు.'' అలా అంటూ మెషీన్ వాడటం, రిసీవర్, కార్డ్, ట్యూన్ మార్చటం ఆఫ్ అండ్ ఆన్ చేయటం నేర్పాడు భవానికి.

'' ఇప్పుడే యిస్తారా?'' అనడిగింది.

'' ఇప్పుడే కొనుక్కోవచ్చు. ఇంకా ఫవర్‌ఫుల్‌వి, కొత్తరకంవీ, పైకి కనబడని చిన్న సైజువీ వస్తున్నాయి. కొత్తవీ కొనుక్కుంటూ వుండాలి. హుషారొస్తుంది. నార్మల్ లైఫ్ లీడ్ చేస్తారు.''

''థాంక్స్ డాక్టర్. నేను శ్యామలలాగా స్వెట్టరూ అల్లి యివ్వలేను. సాక్సూ అల్లలేను. డబ్బే మీ మొహాన పారేస్తాను'' అని నవ్వుతూ పెట్టి అందుకుని చేతి సంచీలో పెట్టుకుని బిల్స్ తీసింది భవాని.

''ప్రిస్క్రిప్షన్‌కి బిల్ చేయరేమోగాని డాక్టర్, యంత్రం వెల నేను కొనుక్కున్నట్టు బిల్ వ్రాయించండి. నేను వస్తూనే వుంటాను. యెక్కువౌతుందన్నారు. మరొకటి మార్చాలేమో తెలుసుకోవాలి'' అన్నది భవాని. శ్యామల నవ్వుతూ అడిగింది. ''మీరు తప్పుగా అనుకోకపోతే మీ ఆశయం తెలుసుకోవాలనుంది డాక్టర్. మా యిద్దరిలో ఒకరిని వరించమనము. వుయ్ ప్రామిస్''.

''తప్పకుండా తెలుసుకోండి. స్నేహితులమయాము. భవాని వస్తూవుంటానన్నారు''.

''పర్సనల్ విషయమే అనుకోండి. వూరికే తెలుసుకుందామని అడుగుతున్నాము. గార్హస్థ్య మెందుకు మిమ్మల్ని ఆకర్షించలేకపోయింది? నచ్చకనా? కుదరకనా? యిష్టం లేకనా? తప్పించుకోవాలనా? కడుపునిండిన బేరమా? బ్రోకెన్ హార్టా? విఫల ప్రేమా? అసలు సంస్థే నచ్చలేదా? బాదరబందీ అనా? ఫ్రీడమ్ కోల్పోతాననా? స్వప్న సుందరి వున్నదా?''

నవ్వుతున్న వాళ్లిద్దర్నీ చూశాడు ప్లేబోయ్.

''భీష్ముడు అర్జనున్ని మీద విసిరినట్టు అన్ని ప్రశ్నలా? పరంపరగా వదిలారే! అవన్నీ కావచ్చు. లేదా కొన్ని కావచ్చు. నా పేరు తెలిసిందిగా. నన్ను చూశారుగా'' అన్నాడు.

''ఆల్‌రైట్ డాక్టర్. మీ స్వంత స్టైల్లో చెప్పండి''.

''నాదేం పోయింది? స్త్రీ తన సంగతి తనే చూసుకోవాలి. నన్నేమీ అడగ్గూడదు. అవసరమొస్తే ఆదుకుంటాను. ఫ్రాన్స్‌లో అంతే. విడిపోయినా ఫ్రెండ్లీగానే వుంటారుట. పెళ్లాడానని చెప్పను. విషమ పరిస్థితిలొస్తే ఆ స్త్రీ దాక్కోవాలి. రావచ్చు అంటే రావాలి. మరొకరితో నేను తిరుగుతుంటే జెలసీ పెంచుకోరాదు. రాతకోతలూ, ప్రమాణాలూ, తంతులూ వుండవు. తనతో ఫంక్షన్‌కి రానంటే హర్ట్ కాకూడదు. ఒక గృహిణి సంతానం కలగలేదని సలహాకోసం వచ్చానన్నది. ఆమె భర్తేమో, '' ఆమెకు నచ్చిన వారి వల్ల ఆమె తల్లి కావచ్చు. నా కభ్యంతరం లేదు.'' అని ఔదార్యం వెల్లడించాడు. బాగా అర్థమైంది. వస్తున్నది కన్సల్టు చేయటానికీ గాదు. ఇవ్వాల్సింది ప్రిస్క్రిప్షనూ గాదు. ''నా ప్రాక్టీసదిగాదు. వేరే డాక్టర్ని పట్టుకోండి.'' అని వదిలించుకున్నాను.'' వాళ్లిద్దరి

నవ్వుతో తనూ నవ్వు కలిపాడు.

''మీ ఆశయాలు అమలు చేయగల స్త్రీ లేదేమో డాక్టర్!''

''యేమో లేదేమో. తక్కినవింకా ఘోరం వినలేరేమో. నా ఫ్రెండూ క్లాస్ మేటూ మరొక డాక్టరున్నాడు. వాడికి మెడిసిన్ పూర్తికాకముందే పెళ్లి చేశారు. భార్యడెలివరీకి తయారైంది. దాన్ని నర్సింగ్‌హోమ్‌లో అడ్మిట్ చేశాడు. హార్డ్ లేబరయేట్టున్నది. ఆపరేషన్ అవసరమేమో రాత్రీ పగలూ మనిషి వుండాలి అన్నారు. పెట్టాడు. అన్నంతా అయింది. నెల వుంచమన్నారు. భార్యా బిడ్డ ఆరోగ్యం పొంది యింటికి వస్తే, కాపలా వున్న నర్స్ కారీయింగని తెలిసింది. భార్య జాలిగుండె. 'సంపాదనపరురాలేగా తాడు కట్టమని'' పర్మిషనిచ్చింది. సవతుల కయ్యం లేదు సఖ్యంగా వున్నారని సంతోషించాడు. డెలివరీకి రెండో భార్యను అదే నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేశాడు. అమె పెద్దప్ప సాయానికీ తోడుకీ వచ్చింది. సాయమూ చేసింది. కాని చావుకబురు చల్లగా చెప్పింది చెల్లికి. మిస్డ్ ది పీరియడ్ అని నవ్వింది. ఆమెకి డబ్బు దండిగా వున్నదట. మనిషే మోరంభే. సొమ్ము సొమ్ముతో కలుపుకుందామన్నారు మొదటి యిద్దరు భార్యలూ. రిజిస్ట్రేషన్ జరిపారు. నా ఫ్రెండుకి తన జబ్బు తెలిసి గాభరాపడి నా దగ్గరకొచ్చి, ''యీ జబ్బుని క్యూర్ చేయి'' అని వేడుకున్నాడు. హీ యీజె లక్కీ ఫెలో. సమయానికి విదేశంనించి వచ్చిన స్పెషలిస్టు, బర్త్ కంట్రోల్ ఆపరేషన్ వేలల్లో చేసినవాడందాడు. శలవు మీద వచ్చాడుట స్వదేశం. వాడి సాయంతో నా ఫ్రెండ్ జబ్బు క్యూర్ చేశా. ఇంక డేంజర్లేదని భరోసా యిచ్చా'' అని కదిలిపోతూ నవ్వాడు ప్లేబోయ్.

''నవ్వెందుకు డాక్టర్? జరిగింది నాచురల్‌గానే వుందిగా''.

''నవ్వురాదా మరి. నా ఫ్రెండుని ''అదేం పనీ?'' అనడిగితే, మూడవ ఆమెకి మతిస్థిమితం లేక బాగా యెంకరేజ్ చేసిందట. నాదేం పోయిందీ అనుకుని మతిలేని ఆమెతో రతి యెలావుంటుందో తెలుసుకోవాలని డిస్కరేజ్ చేయలేదుట, రెసిస్టూ చేయలేదుట. సామాన్య విషయంగా చెపితే నవ్వురాక యేడుపొస్తుందా? మీరూ నవ్వుతున్నారుగా'' అన్నాడు ప్లేబోయ్.

భవానీ శ్యామలా నవ్వుతూనే రోడ్డు మీదకొచ్చారు.

'' ఆ పేరే తగిపోయిందా డాక్టరుకి.'' అన్నది భవాని.